సాక్షి
సూర్యాపేట
గురువారం । 26 । జూన్ । 2025



రాజ్యాంగాన్ని కాపాడుకుందాం
భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.
- 8లో



'కిడ్నీ' ముఠా సభ్యుల అరెస్ట్
విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న కిడ్నీ రాకెట్ ముఠాను కోదాడ పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.
- 8లో



యాదగిరి క్షేత్రానికి మరింత భద్రత
యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి మరింత భద్రత కల్పించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

సూర్యాపేటటౌన్ : మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత కృషి చేయాలని ఎస్పీ నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భావితరాలకు మంచి సమాజాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఈనెల 26న యాంటీ డ్రగ్ డే ను పురస్కరించుకొని వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించినా అక్రమ రవాణా చేసినా రాష్ట్ర పోలీస్ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు లేదా, సూర్యాపేట జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 8712686026కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగే అవగాహన ర్యాలీలో పౌరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని యాంటి డ్రగ్ సోల్జర్ గా నమోదు చేసుకోవాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

నూతనకల్ : తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటించాలని కోరారు. కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరుగు యాదగిరి, పద్మం మల్లయ్య, పీడీ నాగేందర్, నారాయణదాస్, శ్రీనివాస్, రాములు, ఇరుగు సోమయ్య, వంగపల్లి రమేష్, పులుసు శ్రీనివాస్, యాస రాంకుమార్‌రెడ్డి, యూన్సీ, ఎల్లమ్మ, ఉమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ముజావర్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న మొహర్రం (పీర్ల పండుగ) కు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతికి ముజావర్లు బుధవారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. వారితో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ అసదుల్లా ఖాన్, తదితరులకు ఆహ్వాన పత్రికలు ఇచ్చారు. కార్యక్రమంలో ముజావర్లు ఎస్‌కే.సైదా, నాగుల్ మీరా, మీరాపాషా, హుజూర్‌నగర్ గౌడ్ సొసైటీ అధ్యక్షుడు వి.కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం ఎలా..

గ్రామ పంచాయతీలకు నిధులు కరువు

- వానాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అయోమయం
- ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే బిల్లులు
- ఎన్నికలు జరిగి సర్పంచ్‌లొస్తే తగ్గనున్న భారం
- మరో మూడునెలల వరకు కార్యదర్శులదే బాధ్యత



పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సమీపంలో రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం

మొత్తం గ్రామ పంచాయతీలు	పెండింగ్‌లో ఉన్న బిల్లులు సుమారు
475	రూ. 2కోట్లు

భానుపురి (సూర్యాపేట) : వానాకాలంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తనున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు పంచాయతీ కార్యదర్శులు పెద్ద ఎత్తున ఖర్చు చేయగా.. నిధులు రాలేదు. ప్రస్తుత వానాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు మళ్లీ నిధులు అవసరం పడతాయి. ఈ నిధులు ఎక్కడినుంచి తేవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలకు సంబంధించి సుమారు రూ.2కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల స్థానిక ఎన్నికలు జూలైలోనే ఉండే అవకాశముందని ప్రచారం జరగ్గా.. అధికారులు, కార్యదర్శులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే సెప్టెంబర్ వరకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమయం కోరడంతో తప్పనిసరిగా కార్యదర్శులే ఈ భారాన్ని మోయాల్సి వస్తుంది.

నిధులు లేక..

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనా ఇప్పటి వరకు వరుణుడి జాడ లేకపోవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. వర్షాలు పడి ముసురు పెడితే పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతుంది. వీధులన్నీ చిత్తడిగా మారడం, చెత్తాచెదారంతో దోమలు వ్యాపించి అంటువ్యాధులు ప్రబలే అవకాశముంది. ఈ క్రమంలో పంచాయతీలు పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఆయిల్ బాల్స్, ఫాగింగ్ మందు, మురుగు కాల్వల్లో పూడికతీత, ట్రాక్టర్ మెయింటెనెన్స్, పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు ఉంటాయి. ఇప్పటికే ప్రభుత్వం వానాకాలం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించినా.. ఎలాంటి నిధులు కేటాయించలేదు. పంచాయతీ కార్యదర్శులు దుకాణదారుల వద్ద అప్పు తేవాలన్నా.. గతంలో తీసుకొచ్చిన వాటికి బిల్లులు మంజూరు కాకపోవడంతో మళ్లీ ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది.

శానిటేషన్ పనులు చేపడుతాం

జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శానిటేషన్ పనులు చేపడుతాం. మురుగు నిలిచే ప్రాంతాలను గుర్తించి తొలగించే పనులు చేయాలని ఇప్పటికే సూచించాం. దోమల నివారణకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నాం.

– యాదగిరి, జిల్లాపంచాయతీ అధికారి

ఏడాదిన్నరగా ప్రత్యేక అధికారుల పాలన

పారిశుద్ధ్య నిర్వహణకు కావాల్సిన నిధులు ప్రస్తుతం పంచాయతీల వద్ద లేవు. ఏడాదిన్నరగా సాగుతున్న ప్రత్యేకాధికారుల పాలనలో ఇంతవరకూ ఒక్క బిల్లు మంజూరు కాకపోవడమే ఇందుకు నిదర్శనం. అయితే జూన్ నెలాఖరుకు నోటిఫికేషన్ ఇచ్చి జూలై, ఆగస్టులో స్థానిక సంస్థలకు ఎన్నికలు పూర్తవుతాయన్న ప్రచారం జరిగింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి కూడా మంత్రుల నుంచి ఈ మేరకు పలుమార్లు ప్రకటనలు రావడంతో పంచాయతీ కార్యదర్శులు తమ భారం తగ్గతుందని ఆశపడ్డారు. కానీ సెప్టెంబర్ నాటికి ఎన్నికలు పూర్తయ్యే అవకాశముండడంతో వర్షాలు పడే ఈ మూడునెలలు ఎలా వెళ్లదీయాలోనని మదనపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఒక్కో చిన్న పంచాయతీకి రూ.7లక్షల నుంచి రూ.8 లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.12లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. పంచాయతీలు వసూలు చేసే ఇంటి, నల్లా బిల్లులు సైతం ఏడాదిగా డ్రా చేసుకునే వీలు లేకుండా ఫ్రీజింగ్ చేశారు. దీంతో నిధుల కొరత ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుకుంటున్నారు.

వన మహోత్సవ లక్ష్యం సాధించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ , డీపీఓ తదితరులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : వనమహోత్సవ లక్ష్యాన్ని అన్నిశాఖలు సాధించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో వనమహోత్సవం వాటర్ రీచార్జి స్ట్రక్చర్స్, ఇతర అంశాలపై బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ఈసారి వన మహోత్సవంలో ఈత, తాటి వనాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎక్సైజ్, హార్టికల్చర్, ఫారెస్ట్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వారి పరిధిలోని స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాల్లో కొనసాగుతున్న పనులను పర్యవేక్షించడానికి అధికారులు, బృందాలు రానున్నాయని తెలిపారు. ఎంపీఓలు పంచాయతీలోని టాక్స్ కలెక్షన్ల రికార్డులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. డైలీ శానిటేషన్ రిపోర్టును 100శాతం అమలయ్యేలా పనిచేయాలని తెలిపారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వి.వి. అప్పారావు, డీపీఓ యాదగిరి, డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎల్పీఓ నారాయణరెడ్డి, ఎస్‌బీఎం నరేందర్‌రెడ్డి. అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కుపాదం మోపాలి

మాదక ద్రవ్యాల వినియోగంపై జిల్లాలో ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, స్లోగన్, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు మంచి భవిష్యత్తు ఉందని మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే 1908 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు, డాక్టర్లు, విద్యార్థులు, పలు రంగాలకు చెందిన వ్యక్తులు మెడికల్ కాలేజీ నుంచి సద్దల చెరువు వరకు గురువారం జరిగే ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ రూప, అధికారులు హుస్సేన్, చంద్రశేఖర్, వినోద్, సంజీవ్, చైతన్య, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీడిన ఉత్కంఠ

- స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పుతో పల్లెల్లో సందడి
- సెప్టెంబర్ 30లోపు నిర్వహించాలని ఆదేశం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చ
- సన్నద్ధమవుతున్న ఆశావహులు



సూర్యాపేట : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ తొలగింది. నేడోరేపో నోటిఫికేషన్ వస్తుందని కొందరు, ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ ఉండకపోవచ్చని మరికొందరు ప్రచారం చేస్తుండగా.. మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ క్రమంలో స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి కానున్నాయి. జిల్లాలో 486 గ్రామపంచాయతీలు, 213 ఎంపీటీసీ స్థానాలు, 23 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అయితే ఎన్నికల నిర్వహణపై ఓ స్పష్టత రాగా.. రాజకీయ పార్టీలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులతో పాటు ప్రజల్లోనూ ఇక రిజర్వేషన్లపై చర్చ మొదలైంది.

ముందుగా సర్పంచ్ ఎన్నికలేనా..?

జిల్లా వ్యాప్తంగా గతంలో 475గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా 11పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో మొత్తం 486 గ్రామపంచాయతీలు అయ్యాయి. అయితే గతేడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. తర్వాత జూలైలో ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఈ ఏడాది జనవరిలో మున్సిపాలిటీల పదవీకాలం ముగిసింది. ఈ క్రమంలో ఏడాదిన్నర కాలంగా గ్రామ పంచాయతీల్లో పాలన పడకేసింది. తీవ్ర నిధుల కొరత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నిరకాల నిధులు నిలిచిపోయాయి. దీంతో ముందుగా ఈ ఎన్నికలే నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వెంటనే అదే గుర్తులతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సైతం 20రోజుల వ్యవధిలోనే నిర్వహిస్తారని సమాచారం.

ఆశావహుల్లో ఉత్సాహం

రాజకీయ పార్టీల్లో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలతో రాజకీయ పార్టీలు, ఆశావహులు పోటీకి సై అంటున్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయన్న ఆతృతతో ఎదురు చూస్తున్న ఆశావహులకు హైకోర్టు తీర్పు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. జిల్లాలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలతోపాటు, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నాయి. అయితే రిజర్వేషన్ ప్రక్రియ ఎలా ఉంటుందోనన్న ప్రధాన చర్చ జిల్లాలో ఇప్పుడు మొదలైంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు అవుతుందా..? లేదంటే పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయా అన్నది తేలాల్సి ఉంది. ఇదే ఉత్కంఠ ప్రస్తుతం రాజకీయ పార్టీలు, ఆసక్తి ఉన్న అభ్యర్థుల్లో నెలకొంది. అయితే పార్టీలే తాము ఇచ్చే టికెట్లలో 42 శాతం బీసీలకు ఇచ్చే ప్రతిపాదన కూడా వస్తోంది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

మునగాల : జూలై 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు కోరారు. బుధవారం మునగాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణారెడ్డికి సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేసి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కార్మికుల సమ్మె హక్కుకు సైతం పరిమితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని, ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని, కార్మిక శాఖ నిర్వీర్యం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికచట్టాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి రాంబాబు, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతు మైసయ్య గౌడ్, మండల నాయకులు బి.వీరబాబు, నరేష్, బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.



మునగాల : తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

భానుపురి (సూర్యాపేట) : మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేసి సూర్యాపేటను డ్రగ్‌రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 'అయామ్ యాన్ యాంటీ డ్రగ్ సోల్జర్' అనే సెల్ఫీ పాయింట్ వద్ద ఎస్పీ నరసింహతో కలిసి ఆయన సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ బారిన ఎవరూ పడకుండా పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి అధికారి సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగి మాధ్యమాల్లో యువతకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారంలో అందరూ పాల్గొనాలన్నారు. గురువారం సూర్యాపేటలో జరిగే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్, ఎస్పీలు కోరారు.



సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

భానుపురి (సూర్యాపేట) : ఆరేళ్లుగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవనంసాగిస్తున్న పేదలకు శాశ్వతంగా పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామశివారులో గల 126 సర్వేనంబర్‌లో, అలాగే నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 243, 244లో గల ప్రభుత్వ భూములను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆక్రమించుకోగా ఎన్నో నిర్బంధాలు, అరెస్టులను ఎదుర్కొని వాటిలో నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ విషయమై అధికారులు విచారణ చేసి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వడమే కాకుండా వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విచారణ చేపట్టి అర్హులైన వారికి పట్టాలు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, పార్టీ జిల్లా నాయకులు వాస పల్లయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, నాయకులు విజయ్, రజాక్, మరియమ్మ, సైదులు, సత్తెమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎంపిక పోటీల్లో పరుగెడుతున్న విద్యార్థులు



విద్యార్థి బరువు చూస్తున్న పీఈటీలు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను వెలికి తీయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ సూచించారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి 34 మంది బాలురు, 16 మంది బాలికలలు ఎంపికలకు హాజరయ్యారు. వీరికి తొమ్మిది మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపికకు పంపనున్నట్టు జిల్లా స్పోర్ట్స్ అధికారి జి.రాంచందర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమములో ఎస్‌జీఎఫ్‌సెక్రటరీ ఆజమ్ బాబా, బాక్సింగ్ కోచ్ లోకేష్ రాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఈసెట్ ఫేజ్-2 కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

నల్లగొండ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో విడతలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం షెడ్యూల్ విడుదలైనట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1 కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోని వారు ఈ నెల 27న, ఫేజ్-1లో అడ్మిషన్ కేటాయించని వారు, కేటాయించి స్లయిడింగ్‌కు వెబ్‌ఆప్షన్ నమోదు కోసం ఈ నెల 28 నుంచి 30 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఎడిట్ ఆప్షన్‌కు జూలై 1వ తేదీ వరకు అవకాశం ఉందని.. మెరిట్ రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయింపు, స్లయిడింగ్ కొత్త విద్యార్థులకు జూలై 5వ తేదీ నుంచి 7వ తేదీవరకు ఫీజు పేమెంట్ ద్వారా అడ్మిషన్ కేటాయింపు ఉంటుందని తెలిపారు. అదే తేదీలోగా కాలేజీలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

అదనంగా విద్యాధికారులను నియమించాలి

తిరుమలగిరి : పాఠశాలల పర్యవేక్షణకు అదనంగా విద్యాధికారులను నియమించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేపాక లింగయ్య అన్నారు. బుధవారం మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురంలో నిర్వహించిన డీటీఎఫ్ మండల శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే ఉపయోగించాలని, పర్యవేక్షణకు వినియోగించడం మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం పర్యవేక్షణను పెంచడం హర్షణీయమే అయినప్పటికీ, దాని కోసం ఎఫ్‌ఏసీ ఎంఈఓల స్థానంలో రెగ్యులర్ ఎంఈఓలను నియమిస్తూ, అదనంగా మరో ఎంఈఓను కేవలం పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ కె. మధు, సభ్యులు రోచిష్ణుకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం వేదమంత్రోచ్చరణల మధ్య నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, నవీన్‌కుమార్ శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొని యువకుడి మృతి

చింతపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు చెట్టును ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన చింతపల్లి మండలం అనాజీపురం గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి గ్రామానికి చెందిన చీకుమెట్ల అభిలాష్(23) హైదరాబాద్‌లో హెయిర్ కటింగ్ షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తూ.. చింతపల్లి మండలం అనాజీపురం గ్రామ శివారులో మూలమలుపు వద్ద చెట్టును ఢీకొట్టాడు. అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని నాంపల్లి సీఐ రాజు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి..


గణేష్ (ఫైల్)

చిట్యాల: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. నల్లగొండ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు మాజీ కౌన్సిలర్ రెముడాల లింగస్వామి కుమారుడు గణేష్(20) ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతడు మంగళవారం రాత్రి చిట్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం రైల్వే పోలీసులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. చిట్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గణేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడినట్లు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. చిట్యాలలో గణేష్ భౌతికకాయానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు నివాళులర్పించారు.

కిడ్నీల దందా ముఠా సభ్యుల అరెస్ట్

- కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తామని కోదాడకు చెందిన వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసి పరారీ
- బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిని అరెస్ట్ చేసిన కోదాడ పట్టణ పోలీసులు
- పరారీలో మరో నలుగురు
- గత కొన్నేళ్లుగా విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న దందా
- డయాలసిస్ కేంద్రాల వద్ద కిడ్నీ బాధితులతో పరిచయం పెంచుకొని మోసం చేస్తున్న నిందితులు


వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పక్కన కోదాడ పట్టణ సీఐ శివశంకర్

కోదాడరూరల్: విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న కిడ్నీల దందా ముఠా సభ్యులను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన కడుపూరి తాతారావు, ఎన్టీఆర్ జిల్లా భవానీపురానికి చెందిన కొండం రమాదేవి, విజయవాడకు చెందిన బొందిలి పృథ్వీరాజ్, గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన కొడాలి బాబురావు, కందుకూరి విష్ణువర్ధన్ బాబు, విజయవాడకు చెందిన మహ్మద్ సర్దార్‌తో పాటు మరో నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. వీరు కిడ్నీ ఆస్పత్రులు, డయాలసిస్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పేషెంట్లను గుర్తించి వారితో పరిచయం పెంచుకుంటారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించేందుకు డోనర్‌తో మాట్లాడామని కిడ్నీ వ్యాధిగ్రస్తులతో చెబుతారు. వారిని నమ్మించేందుకు నకిలీ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, రక్త పరీక్షలకు సంబంధించిన పత్రాలు కూడా సృష్టించి.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు రూ.లక్షల్లో ఫీజు అవుతుందని, ఆస్పత్రిలో డబ్బులు కట్టాలని చెప్పి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి ఆపరేషన్ చేయించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ విధంగా వారు పది మందిని మోసం చేశారు.

కోదాడ వాసి నుంచి రూ.22లక్షలు వసూలు..

కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురానికి చెందిన నరేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. అతడికి ఈ ముఠా గతేడాది డిసెంబర్‌లో పరిచయమై.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తామని, ఆపరేషన్‌కు రూ.22లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. నరేష్ నుంచి రూ.22 లక్షలు వసూలు చేసి ఆస్పత్రిలో డబ్బులు కట్టకుండా పరారయ్యారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నరేష్ స్వయంగా ఆస్పత్రిలో డబ్బులు చెల్లించి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల అతడి ఆరోగ్యం కుదుటపడటంతో వారం కిందట కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కిడ్నీ రాకెట్ ముఠాలోని ఆరుగురిని కోదాడ పట్టణ పోలీసులు బుధవారం ఉదయం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, ఆరు రబ్బర్ స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శివకుమార్, కోదాడ పట్టణ సీఐ శివశంకర్, ఎస్‌ఐ సుధీర్ కుమార్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందిచారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

సూర్యాపేట: రాజ్యాంగాన్ని కాపాడుకొని మనుధర్మ సంస్కృతిని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఆదివాసీ బునియాది కార్యకర్తల సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల మనుధర్మ సంస్కృతిని ఆదివాసీ బంజారాలపై రుద్దుతూ వారి సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగయ్యేలా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం ఆదివాసీ గిరిజనులకు ఎన్నో హక్కులను కల్పించిందని, వాటిని అమలు చేయకుండా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అడ్డుకుంటున్నాయన్నారు. ఏ దేవుడిని పూజించాలో కూడా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చెప్పడం సరికాదన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆదివాసీ గిరిజనులకు నాడు జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మొదలుకొని నేటి రాహుల్ గాంధీ వరకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బాల్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొట్యానాయక్ భూక్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్ననాయక్, ప్రోగ్రాం ఇన్‌చార్జి లింగంనాయక్ పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలతో దౌర్జన్యం చేస్తున్నారు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నాయకులు రాజకీయ కుట్రలతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులపై అధికారుల అండదండలతో దౌర్జన్యం చేయడంతో పాటు ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. చిట్యాలలో బుధవారం ఆయన విలేరులతో మాట్లాడుతూ.. చిన్నకాపర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానికంగా ఉన్న మంచిపేరును బదనాం చేసేందుకుగాను ఆయన వ్యవసాయ క్షేత్రం వద్ద పౌల్ట్రీఫాంను అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేలమట్టం చేశారన్నారు. అతడికి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, లేదంటే కోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. అధికారులు అధికార పార్టీకి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జనగాం నర్సింహగౌడ్, నాయకులు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిట్ట బొందయ్య, కొలను సతీష్‌గౌడ్, బొబ్బల శివశంకర్‌రెడ్డి, కందాటి రమేష్‌రెడ్డి, కోనేటి ఎల్లయ్య, యకారి నరేందర్, జిట్ట శేఖర్, ఆగు అశోక్, వల్లమల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల వద్ద విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం


పులిచింతలలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

హుజూర్‌నగర్: చింతలపాలెం మండలం వజినేపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగమైన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి బుధవారం ప్రారంభమైంది. ఈ కేంద్రంలో మొత్తం నాలుగు యూనిట్లు ఉండగా ఒక యూనిట్ ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 15 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా డెల్టాకు తాగు, సాగునీరు అవసరమైన నేపథ్యంలో ఏపీ ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు నీటిని వదులుతూ తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి మొదలు పెట్టారు. ఈ వర్షాకాల సీజన్‌లో విద్యుత్ ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారి. డ్యాం దిగువ కృష్ణా డెల్టాకు వదులుతున్న నీటి ద్వారా ఉత్పత్తి అయిన 15 మెగావాట్ల విద్యుత్‌ను తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు జెన్‌కో ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నేరేడుచర్ల: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వెలిదండి శివ(45) బుధఆరం తన అత్తగారి ఊరైన గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే హుజూర్‌నగర్ నుంచి నేరేడుచర్ల వైపు వస్తున్న లారీని డ్రైవర్ ధరావత్ హేమాకుమార్ అతివేగంగా నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో శివను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వర్ణగిరిలో సుదర్శన నరసింహ ఇష్టి హవనం


శ్రీసుదర్శన నరసింహ ఇష్టి హవనం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరిపట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకుని శ్రీ సుదర్శన నరసింహ ఇష్టి హవనం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నదానం, సాయంత్రం అష్టదళ పాదపద్మార్చన సేవ, తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధరకర్త మానేపల్లి మురళీకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లగొండ జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ కడుపులో నుంచి 6 కిలోల కణితి తొలగింపు

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్య బృందం బుధవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. 60 ఏళ్ల మహిళ కడుపులో ఉన్న 6 కిలోల కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పర్వేదుల గ్రామానికి చెందిన 60 ఏళ్ల మహిళ గత రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. వైద్యులు ఆమెను పరీక్షించి కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. మహిళ కుటుంబ సభ్యుల సమ్మతితో బుధవారం 4గంటల పాటు శస్త్రచికిత్స చేసి 6 కిలోల కణితిని తొలగించారు. శస్త్రచికిత్స చేసిన వైద్యుల బృందంలో డాక్టర్లు శ్రీకాంత్‌వర్మ, నిఖిత, వంశీ, దివ్య, బద్రినారాయణ, నవీన్, సుధా, గిరి, శ్వేత ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి వైద్యుల బృందాన్ని అభినందించారు.

మెడికల్ ఏజెన్సీ గోదాంలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాప్తి
- రూ.కోటిన్నరకు పైగా ఆస్తి నష్టం
- నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్‌లో ఘటన


దగ్ధమవుతున్న సాయిరామ్ మెడికల్ ఏజెన్సీ


విలపిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు, కుటుంబ సభ్యులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్‌లో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మెడికల్ ఏజెన్సీ గోదాం దగ్ధమైంది. వివరాలు.. ప్రకాశం బజార్‌లోని సాయిరామ్ మెడికల్ ఏజెన్సీ గోదాంలో బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పుతుండగానే ఫైరింజన్‌లో నీళ్లు అయిపోయాయి. మంటలు మాత్రం అదుపులోకి రాలేదు. దీంతో రిపేర్‌లో ఉన్న పాత ఫైరింజన్‌తో పాటు నకిరేకల్ నుంచి మరో ఫైరింజన్ తెచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. వన్‌టౌన్ పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తదితరులు మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్లు తెప్పించి మంటలు ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సుమారు 2గంటల పాటు శ్రమించిన తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఆ తర్వాత మధ్యాహ్నం వరకు పూర్తిగా మంటలను ఆర్పివేశారు. ఈ మెడికల్ ఏజెన్సీ గోదాం ఇరుకు సందులో ఉండటంతో పాటు పక్కనే నోబుల్ ఆస్పత్రి, మరో వైపు బ్యాంకు, నివాస గృహాలు ఉన్నాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఫైరింజన్‌లో సరిపడా నీరు లేకపోవడంతో భారీ నష్టం జరిగిందని, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే నష్ట తీవ్రత తగ్గేదని ఏజెన్సీ నిర్వాహకుడు, స్థానికులు తెలిపారు. సుమారు రూ.కోటిన్నర వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సాయిరామ్ మెడికల్ ఏజెన్సీ యజమాని గంజి అశోక్ తెలిపారు.

సకాలంలోనే స్పందించాం..

ప్రకాశంబజారులోని మెడికల్ ఏజెన్సీలో మంటలు వస్తున్నాయని సమాచారం రావడంతో వెంటనే అక్కడకు వెళ్లామని నల్లగొండ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంటలు పెద్దఎత్తున రావడంతో ఫైర్ సిబ్బంది ఎక్కువ ప్రెషర్‌తో నీటిని కొట్టడంతో ఫైరింజన్‌లో నీరు త్వరగా అయిపోయాయని పేర్కొన్నారు. వెంటనే లతీఫ్ సాహెబ్ గుట్ట వద్దకు వెళ్లి ఫైరింజన్‌లో నీరు నింపుకుని వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశామన్నారు. అంతేకాకుండా పాత ఫైరింజన్‌తో పాటు నకిరేకల్ నుంచి మరో ఫైరింజన్ తెప్పించి మంటలు ఆర్పివేసినట్లు తెలిపారు. ఫైరింజన్‌లో ఉన్న మొత్తం నీటిని తక్కువ ప్రెషర్‌తో కొడితే అరగంట వస్తాయని, మంటలు పెద్దగా ఉన్నప్పుడు ప్రెషర్ పెంచితే పావు గంటలో నీరు అయిపోతుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై అవగాహన లేనివారు ఫైరింజన్‌లో నీరు లేకుండా వచ్చామని ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవమని ఆయన వివరణ ఇచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


సుకుమార్ (ఫైల్)

అర్వపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. అర్వపల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బి. రాంకోటి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లంపల్లి గ్రామానికి చెందిన వంగాల సత్తయ్య చిన్న కుమారుడు వంగాల సుకుమార్ (28) కొంతకాలం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. రెండు నెలల క్రితం అక్కడ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల స్వగ్రామంలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. అయితే సుకుమార్ గతంలో కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో లోన్లు తీసుకొని వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాడు. ప్రస్తుతం ఉద్యోగం లేకపోవడంతో ఫైనాన్స్ కంపెనీలకు వాయిదాలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాంకోటి తెలిపారు.

• వరుణ దేవా.. కరుణించవా



ఈ ఖరీఫ్ సీజన్‌లో వానలు సరైన సమయంలో పడకపోవడంతో పత్తి సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వర్షాలు కురవాలని బుధవార మోటకొండూర్ మండల కేంద్రంలో మహిళలు జల్ల కడువలు పేర్చి బతుకమ్మ ఆడారు. వాన దేవుడు కరుణించాలని పాటలు పాడారు.

– మోటకొండూర్

నగదు అపహరించిన బాలుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎదుట గల ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఓ బాలుడు నగదు అపహరించాడు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న లక్ష్మీదేవి డాక్యుమెంటేషన్ అండ్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు భాను మంగళవారం రాత్రి టేబుల్ డ్రాలో రూ.30వేల నగదు ఉంచి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి వచ్చి చూసేసరికి నగదు కనిపించకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ బాలుడు మంగళవారం అర్ధరాత్రి ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ వెనుక భాగంలో ఉన్న కిటికిలో నుంచి లోపలికి దూకి, డ్రాలో ఉన్న నగదును తీసి లెక్కిస్తున్నట్లు కనిపించింది. వెంటనే భాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీంపేట గ్రామానికి చెందిన లింగాల యాదయ్య(65) బుధవారం సాయంత్రం తన ఇంటి పైన ఇనుప చువ్వను తీసి పెంట్‌హౌజ్‌పై వేస్తుండగా.. ఇనుప చువ్వ విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

యాదగిరి క్షేత్రానికి మరింత భద్రత

- ఇప్పటికే ఎస్‌పీఎఫ్, హోంగార్డు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో రక్షణ
- మరో 120 మందిని నియమించేందుకు సన్నాహాలు


క్యూలైన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మరింత భద్రత కల్పించే దిశగా ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌పీఎఫ్, హోంగార్డు, ప్రైవేట్ భద్రతా సిబ్బందితో పాటు మరికొంత మంది ప్రైవేట్ సిబ్బందితో పాటు పోలీస్, డిఫెన్స్‌లో కొద్దిరోజులు సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని నియమించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆలయంలో చోటుచేసుకుంటున్న సంఘటనలతో పాటు భక్తులకు సరైన భద్రత లేదనే విమర్శలకు దీటుగా భద్రతను పెంచాలనే ఆలోచనలో ఈఓ వెంకట్రావ్ ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆలయానికి భద్రతను పెంచనున్నట్లు తెలిసింది.

ప్రస్తుతం ఆలయంలో ఇలా..

ఆలయంలో ప్రస్తుతం ఎస్‌పీఎఫ్ సిబ్బంది 43మంది పనిచేస్తున్నారు. ఇందులో ఒక ఆర్ఐ(సీఐ క్యాడర్), ఇద్దరు ఎస్‌ఐలు, 5 మంది ఏఎస్‌ఐలు, 9మంది హెడ్ కానిస్టేబుళ్లు, 26 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. మరో 23మంది హోంగార్డులు, 33 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో పాటు బాంబ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కలిసి 24 మంది ఉన్నారు.

మరో 120 మంది వరకు అవసరం..

యాదగిరిగుట్ట ఆలయానికి మరో 120కి పైగా భద్రతా సిబ్బంది అవసరం ఉన్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఇందు కోసం డిఫెన్స్, పోలీస్ శాఖలో పనిచేసిన వారితో పాటు ప్రైవేట్ సెక్యూరిటీని సైతం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు ఇటీవల ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఇప్పటికే ఆలయంలో పలు చోట్ల ఉన్న బ్యాగ్ స్కానర్లు, డీఎఫ్‌ఎండీలతో పాటు కల్యాణకట్ట, మెట్ల మార్గంలో, కొండ పైన మరికొన్ని ప్రాంతాల్లో వీటిని బిగించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందు కోసం మరింత మంది భద్రత సిబ్బంది కావాలని అధికారులు అంచనాకు వచ్చారు. త్వరలోనే మరో 120 మందితో ఆలయానికి భద్రత కల్పించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి..



యాదగిరిగుట్ట ఆలయానికి మరింత భద్రత కల్పించేందుకు ఈఓ వెంకట్రావ్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఇటీవల ఆలయాధికారులతో పాటు పోలీసు శాఖతో చర్చలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భద్రతా సిబ్బందితో పాటు మరో 120కి పైగా సిబ్బంది అవసరం ఉందని భావిస్తున్నారు. ఇందుకు ప్రైవేట్ సెక్యూరిటీని నియమించి భద్రత కల్పించాలని చూస్తున్నాం. ఇప్పటికే డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ పలుమార్లు ఆలయ పరిసరాలను పరిశీలించి భద్రతపై ఆరా తీశారు.

– శేషగిరిరావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ